క్లుప్తంగా

వెంగన్నపల్లెలో పోలీసు సోదాలు



ఇళ్లలో సోదాలు చేస్తున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: మండలంలోని వెంగన్నపల్లెలో శనివారం ఉదయం యాడికి, పెద్దపప్పూరు ఎస్‌ఐలు గురు ప్రసాద్ రెడ్డి, శరత్‌చంద్ర, పోలీసు సిబ్బందితో సోదాలు నిర్వహించారు. గ్రామంలోని రౌడీ షీటర్ల ఇళ్లు, కళ్లాలు, దిబ్బల్లో ఏమైన మారణాయుధాలు ఉన్నాయోమోనని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్‌ఐలు మాట్లాడుతూ కుటుంబ పోషణకు ప్రతి ఒక్కరూ ఏదో ఒక పనిని చేసుకోవాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినపుడు పోలీసులు దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తా మన్నారు. తరచూ గొడవలు చేసుకుంటూ పోతే పచ్చని కాపురాలు అల్లకల్లోలమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె: మండలంలో వివిధ గ్రామాల్లో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు వైఎస్సార్ రైతు భరోసా కోసం రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. శనివారం ఏఓ మాట్లాడుతూ ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం లోపు దరఖాస్తు అందించాలన్నారు.

కంపచెట్ల తొలగింపు



బీసీసీరోడ్డుకిరువైపులా కంపచెట్లు తొలగించిన దృశ్యం

పామిడి: పట్టణంలో శనివారం పంచాయతీ అధికారులు గుత్తి-అనంతపురం బీసీసీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగింపజేశారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, చెత్తా చెదారాన్ని పూర్తిగా ఎత్తివేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను మార్చారు. దీంతో వాహనాల రాకపోకలకు సుగమమైంది. ఈఓఆర్డీ బీవీ శశికళ, ఈఓ పీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పనులు జరిగాయి.

శుద్ధ దోపిడీ..!

- అసోసియేషన్ పేరుతో అధిక ధరలకు నీటి విక్రయాలు
- అంతా జీరో వ్యాపారమే
- ప్రతి నెలా రూ.లక్షల్లో ప్రభుత్వాదాయానికి గండి..
- నోటీసులతోనే సరిపెట్టుకుంటున్న మున్సిపల్ అధికారులు
- నియోజకవర్గంలో 200కు పైగా అనుమతిలేని వాటర్ ప్లాంట్లు



తాడిపత్రి లోని ఓ వాటర్ ప్లాంట్



అసోషియేషన్ పేరుతో ప్లాంట్ల ముందు ధరలను సూచిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తాడిపత్రి అర్బన్: శుద్ధజలం పేరిట.. దోపిడీ జరుగుతోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న నీటిశుద్ధి కేంద్రాలపై అధికారుల నిఘా కొరవడింది. దీంతో నిర్వాహకులు సరఫరా చేసిందే శుద్ధ జలంగా ఉన్నట్లుంది. వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధలు ఉల్లంఘిస్తూ మినరల్ వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. 20 లీటర్ల నీటికి రూ.10 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు ఇలా..

నిభందనల ప్రకారం వాటర్‌ప్లాండ్లలో ఎయిర్ కండీషనర్‌తో పాటు కెమికల్ ల్యాబ్, మైక్రోబయాలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఎస్‌ఐ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ అంతా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. అధికారులు ప్రతి 3 నెలలకొకసారి ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటేనే లైసెన్స్‌లు ఇవ్వడం కానీ అంతకు ముందున్న లైసెన్సులను పునురుద్ధరించాల్సి ఉంది. ప్లాంట్ నిర్వాహణతో పాటు వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంది. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా వాటర్ ప్లాంట్లను నెలకొల్పుతున్నారు. పట్టణంలోని రెండు ప్లాంట్లకు మాత్రమే అనుమతి ఉన్నట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చెబుతున్నారు.

నిబంధనలకు 'నీళ్లు'..

రంగు లేనీ నీరు కాస్తంత తీయ్యగా ఉంటే చాలు. ప్లాంట్లను నడిపేస్తున్నారు. నిబంధనల మేరకు నీటిని శుద్ధి చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. రూ.20లు పెట్టి కొన్న క్యాన్ నీటిలో రెండు రోజుల్లోనే క్రిములు తయారవడంతో పాటు దుర్వాసన వస్తున్నాయి. నీటిని శుద్ధి చేస్తున్నారో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరిగా శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల అనేక రకాల వ్యాదులు వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. టైఫాయిడ్, పచ్చ కామెర్లు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, చర్మ వాధ్యులతో పాటు కీళ్ళ నొప్పులు, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అసోసియేషన్ పేరుతో బెదిరింపులు

నియోజకవర్గంలో సుమారు 200లకు పైగా వాటర్ ప్లాంటున్నాయి. ఒక్క తాడిపత్రి మండలంలోనే 47 ప్లాంట్లు ఉండగా వాటిలో ఒక్క దానికి కూడా అనుమతి లేకపోవడం గమనర్హం. చేసేది తప్పుడు పని పైగా అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తూ ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. యల్లనూరు రోడ్డులోని ఓ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు ఏకంగా అసోసియేషన్ ఏర్పాటు చేసి తాను చెప్పిందే వేదం అన్నట్లు తాను నిర్ణయించిన ధరలకే నీటిని విక్రయించాలని లేదంటే ప్లాంట్లను బంద్ చేసుకోవాలని హుకుం జారీ చేస్తున్నాడు. దీంతో రెండు రోజుల కింద పట్టణంలోని కొందరు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయించలేక తమ ప్లాంట్లను మూసివేసుకున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు.

నీళ్లు కొనలేకపోతున్నాం:



గతంలో బిందె నీరు రూ.2లు ఉండేది. ఇప్పుడు ఏకంగా బిందె రూ.10లకు విక్రయిస్తున్నారు. అధిక ధరకు నీళ్లను కొనలేకపోతున్నాం. రోజుకు 3 బిందెల తాగునీరు అవసరమౌతాయి. రోజుకు రూ.30లు చొప్పున నెలకు తాగునీటికే రూ.900లు ఖర్చు చేయాల్సి వస్తోంది. అధికారులు ధరలను తగ్గించేలా చూడాలి.

– విజయలక్ష్మి, సీపీఐ కాలనీ, తాడిపత్రి

ఒక్క ప్లాంట్‌కూ ట్రేడ్ లైసెన్స్ లేదు



వాటర్ ప్లాంట్లకు ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయడం మా పరిధిలో ఉంటుంది. అయితే ప్లాంట్లకు అనుమతిచ్చేది మాత్రం ఫుడ్ సేఫ్టీ అధికారులదే. వారు నీటి నమూనాలను సేకరించి పరీక్షించి సంతృప్తికరంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తారు. అయితే తాడిపత్రి మున్సిపాలిటీలో 50కి పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నా ఏఒక్క ప్లాంట్‌కు ట్రేడ్ లైసెన్సులు లేవు.

– జి.రవి, మున్సిపల్ కమిషనర్, తాడిపత్రి

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికుడికి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న డీఎం నారాయణస్వామి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కె.గిరి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు.. శనివారం గుత్తి నుంచి గుంతకల్లు బస్సు (ఏపీ02జెడ్ 0347)లో ప్రయాణించిన ఆలూరుకు చెందిన రాఘవేంద్రరెడ్డి సీటులో తన విలువైన స్మార్ట్‌ఫోన్‌ను మరిచిపోయాడు. దీన్ని గమనించిన కండక్టర్ గిరి ఫోన్‌ను ఆర్టీసీ డిపో సెక్యూరిటీ అధికారులకు అప్పగించారు. ప్రయాణికుడి వివరాలు సేకరించి అతనిని డిపోకు రప్పించి డిపో మేనేజర్ నారాయణస్వామి చేతుల మీదుగా స్మార్ట్ ఫోన్‌ను రాఘవేంద్రరెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కండక్టర్, అధికారులకు సదరు ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలిపారు.

గుత్తి: తనకు దొరికిన విలువైన సెల్ ఫోన్‌ను బాధితురాలికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు ఓ హోటల్ నిర్వాహకుడు. వివరాలు.. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన లలితమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి పని మీద ఆటోలో గుత్తికి వచ్చింది. అయితే లలితమ్మకు చెందిన సెల్ ఫోన్ ఎక్కడో పడిపోయింది. ఆ సెల్‌ఫోన్ గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద హోటల్ నిర్వాహకుడు గులాబికి దొరికింది. వెంటనే ఆరా తీసి బాధితురాలు లలితమ్మకు ఆ సెల్‌ఫోన్‌ను అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



క్రిష్టిపాడు ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

పెద్దవడుగూరు: గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం క్రిష్టిపాడు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇదిలా ఉండగా అప్పేచెర్లలో యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులుఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ చేపట్టారు. అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఆధిపత్యం కోసం సమస్యలు సృష్టిస్తే ఎంతటివరైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. శనివారం సమస్యాత్మక గ్రామాలైన దేవునిఉప్పలపాడు, చిన్నయక్కలూరు గ్రామాల్లో ఎస్‌ఐ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్య వచ్చినపుడు సొంత నిర్ణయం తీసుకోకుండా తక్షణమే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. గొడవలకు దిగకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

దివ్యాంగురాలికి మూడు చక్రాల వాహనం అందజేత



పద్మావతికి వాహనం అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, ఎంపీ ల్యాడ్స్ డీడీ అరిందమ్ మోడక్

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పద్మావతికి ఎంపీ తలారి రంగయ్య, ఎంపీ ల్యాడ్స్ డిప్యూటీ డైరెక్టర్ అరిందమ్ మోడక్ మూడు చక్రాల వాహనం అందజేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి రూ.90 వేలు విలువ చేసే మూడు చక్రాల వాహనాన్ని కొనుగోలు చేసి ఎంపీ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ ఓబిలేసు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, చెన్నకేశవులు, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, పప్పూరు మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు ఆర్థిక సాయం



రఫీక్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఆటోడ్రైవర్లు

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్‌కు తోటి ఆటో డ్రైవర్లు అండగా నిలిచారు. వివరాలు..గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన ఆటో డ్రైవర్ రఫీక్‌కు రెండు రోజుల క్రితం పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో వైద్యం కోసం అతడు ఇబ్బందులు పడుతున్నాడని తోటి డ్రైవర్లు తెలుసుకున్నారు. దీంతో శనివారం చందాలు పోగు చేసి రూ.15 వేలు రఫీక్‌కు అందజేశారు. రఫీక్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం ఆటో డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిబంధనలు పాటించాలి

గార్లదిన్నె: టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సాగర్ సూచించారు. గార్లదిన్నె, కల్లూరులో టపాసుల విక్రయం కోసం ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టపాసుల విక్రయం కోసం దరఖాస్తు చేసుకున్న వారితో ఎస్‌ఐ మాట్లాడారు. టపాసులను కేటాయించిన స్థలంలో మాత్రమే విక్రయించాలన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

పామిడి: పట్టణంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో స్థానిక కన్యకా పరమేశ్వరీమాత, అంబా భావాని, భోగేశ్వరాలయంలోని లక్ష్మీ ప్రసన్న పార్వతి, అంకాలమ్మ, కుంటిమ్మ, అనుంపల్లి ఒడ్డుగట్టు సుంకులమ్మ తదితర గ్రామదేవతల ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక అంబాభవాని ఆలయంలో అమ్మవారు ఆదివారం బాల త్రిపుర సుందరీదేవి, 16న గాయత్రి దేవిగా, 17న అన్నపూర్ణ దేవి, 18న మహాలక్ష్మీదేవిగాను, 19న లలిత త్రిపుర సుందరీదేవి, 20న సరస్వతీ దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసుర మర్దిని, 23న రాజరాజేశ్వరి రూపంలో దర్శనమివ్వనున్నారు.

వ్యక్తి బలవన్మరణం

గార్లదిన్నె: కొప్పలకొండ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాగార్జున(35) శనివారం గొర్రెలమేత కోసం సమీప వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లాడు. అక్కడే పురుగు మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దలు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

గుత్తి రూరల్: మండలంలోని నేమతాబాదు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... నేమతాబాద్ గ్రామ శివారులో కంపచెట్లలో దుర్వాసన వస్తుండటంతో శనివారం కొందరు వెళ్లి పరిశీలించారు. అయితే కంప చెట్ల నడుమ సుమారు 45 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని మృతదేహం పడి ఉంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం దుర్వాసన వస్తుండటంతో మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు తెల్ల అంగి, బ్లూ కలర్ డ్రాయర్ ధరించాడు. మృతదేహానికి సమీపంలో పురుగుల మందుతో పాటుగా మద్యం బాటిల్ పడి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన వైద్య సేవలందించండి



గైనిక్ వార్డులో అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ పాల్ రవికుమార్

- డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్

గుంతకల్లు టౌన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించి ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచాలని వైద్యులకు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ సూచించారు. శనివారం గుంతకల్లులోని రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. గైనిక్, పీడియాట్రిక్, ఆర్థో విభాగాలను పరిశీలించారు. అందుతున్న సేవలపై రోగులతో ఆరా తీశారు. బ్లడ్‌బ్యాంక్‌లో రక్త నిల్వలను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవలు, కల్పించాల్సిన అదనపు సౌకర్యాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌తో చర్చించారు. ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యులు, తగినంత సిబ్బంది అందుబాటులో ఉన్నారని, దీంతో చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు ప్రభుత్వాస్పత్రిలోనే వైద్య సేవలు పొందేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అవసరాన్ని బట్టి మేజర్ ఆపరేషన్లు సైతం చేయాలని ఆదేశించారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: స్థానిక శిల్పారామంలో దసరా పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అనంత్ నాగ్ సంగీత్ స్వర్ కల్చర్ కమిటీ అధ్యక్షుడు నాగిసీప్రసాద్ ఆధ్వర్యంలో 200 మంది కళాకారులతో జానపదాలు, సినీ సంగీత కచేరీ ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బీకేఎస్ విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, జూడో, బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ అండర్-17 పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు కీర్తన, పూజిత, పావని, అండర్-17 బాలుర విభాగంలో శివ ప్రతిభ చాటారన్నారు. వీరు కోనసీమలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటార న్నారు. అండర్-14 బాలికల విభాగంలో ప్రశాంతి, బాలుర విభాగంలో బాబా అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారా స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు

గుత్తి: సెబ్ పోలీసులు శనివారం నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గుత్తి ఆర్‌ఎస్‌లోని ఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం సెబ్ సీఐ వరలక్ష్మి నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిగురుగుట్ట తాండాకు చెందిన రవీంద్రనాయక్‌ను బైక్‌పై నాటు సారాను తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడి నుంచి 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం త్రుటిలో ఆటో ప్రమాదం తప్పింది. వివరాలు... గుత్తి ఆర్‌ఎస్ నుంచి గుత్తి వైపు వస్తున్న ఆటో బస్టాండ్ వద్దకు రాగానే టైర్ బోల్టులు ఊడిపోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అయితే ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులు, రోడ్డు పక్కన నిలుచున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళ మొబైల్ లాక్కెళ్లిన దొంగలు



సంఘటన గురించి పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు అనిత్య

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో శనివారం రాత్రి మహిళ నుంచి ఇద్దరు దొంగలు మొబైల్ లాక్కెళ్లారు. వివరాలు.. రైల్వే క్వార్టర్స్‌లో అనిత్య ఇంటి వద్ద వాకింగ్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు మొబైల్ లాక్కొని ఉడాయించారు. వెంటనే అప్రమత్తమైన అనిత్య భర్తతో కలిసి బైక్‌పై దొంగలను వెంబడించారు. వీరి రాకను పసిగట్టిన దొంగలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బైక్‌ను వదిలేసి పరారయ్యారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దొంగల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఆర్ఎఫ్ రోడ్డులో పూజలందుకునే లక్ష్మీ సమేత వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆదిదేవుడి బ్రహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో నగరంలోని పలు వీధులు విద్యుత్ దీపాల కాంతులతో వెలుగులీనుతున్నాయి. నగరంలోని ఆర్ ఎఫ్‌రోడ్‌లో ఉన్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శోభాయమానంగా అలంకరించారు.

నిత్య వాహన సేవలు : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు 15వ తేదీన శేషవాహనం, 16న హంసవాహనం, 17న సింహ వాహనం, 18న హనుమద్ వాహనం, 19న గరుడ వాహనం, 20న గజ వాహనం, 21న చంద్రప్రభ వాహనం, 22న అశ్వవాహనంపై స్వామి భక్తులకు దర్శనమిస్తారు. 23న మహా రథోత్సవం, 24న చక్రస్నానం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. శ్రీనివాసనగర్‌లోని బాలాజీ మందిరం, హౌసింగ్ బోర్డు, రామనగర్ తదితర ప్రాంతాల్లోని శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరగనున్నాయి.